# శ్రీ రామ రమామృతం




ఆవేదకుఁడు

సహృదయుల సహకారంతో

**వల్లభజ్యోస్యుల వేంకట రామప్రసాదు**

## మంగళాచరణం

*//ఉత్సాహము//* *[1]*

అంజలిం పరాత్పరం తరాంతరం తమాంతకం
భంజళీ జనావళీ ప్రభంజనం విభాజకం
రంజనంక్షమం నిరంతరం సుఖాంతరంజకం
కుంజరం సమాశ్రయే నికుంభకాంతకార్చితం

*//ఉత్సాహము//* *[2]*

సుందరం మనోహరం ప్రసూన కుంద మందరం
బంధురం నిబద్ధ భక్త బంధనా సుభంజకం
మంధిరం సుభాగ్య నిత్యమంగళా సుభూషితం
వందనం మునీంద్ర వేద వందితం రఘోత్తమం

*//ఉత్సాహము//* *[3]*

శ్లాఘనం మరీచహంత సాధుకృత్య సాధకం
సాగరం దయాతరంగ సామగాన శోభితం
యోగ సిద్ధి కారకం, మయూఖ రేఖ రాజితం
రాఘవం, విపన్నకార్త లాలకం, ప్రణామ్యహం

*//ఉత్సాహము//* *[4]*

నీలమేఘ వర్ణకం, పునీత పాద పంకజం,
శైల భద్ర శోభితం, తుషార వీక్షణీక్షకం
బాల సూర్య భాస్వరం తమాంధకార మార్జకం
పాలనార్థ ప్రార్థనం, కృపానిధిం, రమాపతిం

[1] శ్రేష్ఠులకందరికి శ్రేష్ఠుడైన వానికి, భవసాగరం దాటుటకు మర్మము తెలియజేయు వానికి, మనోభ్రాంతిని నాశనము చేయువానికి, వంకరగా పోవు జనసమూహపు బాధాకెరటాలను హతమార్చు వానికి, ఎల్లవేళలా సంతోషముగానుండుటకు తగినంత ఆనందాన్ని కలగజేసి జన్మ సుఖాంతం చేయువానికి, నికుంభుని అంతంచేసిన బలశాలి హనుమంతునిచే ఆరాధించబడు దేవతా శ్రేష్ఠుడైన శ్రీ మహావిష్ణునకు పరిరక్షించమని చేమోడ్పు.

[2] విచ్చిన పారిజాత పుష్పమువలె సుందరమైన పుణ్యవంతునకు, భవబంధాలలో చిక్కుకున్న భక్తుల చెఱ విడిపించు ఒప్పిదమైన (రమణీయమైన) వానికి, సౌఖ్యమునిచ్చు సాగరమువంటి శాశ్వత శుభాలంకారునకు, మునిశ్రేష్ఠులచే వేదమంత్రాలతో స్తుతింపఁబడు రఘువంశోత్తముడైన శ్రీరామచంద్రునకు అభివాదములు.

[3] మారీచాది రాక్షసులను హతమార్చి సాత్విక కార్యక్రమములను నిర్విఘ్నముగా కొనసాగ దోహదంచేసినవానికి, కనికరమనే కెరటాలతో ఉప్పొంగే సముద్రమువంటి సామగాన అలంకృతునికి, సకల సౌభాగ్యముల ప్రాప్తికి మూల కారకుడై కాంతి కిరణాలతో ప్రకాశించే వానికి, విపత్తులతో దుఃఖమునొందు వారికి ఉపశమనం కలగజేయు శ్రీరామచంద్రునకు ప్రశంసాపూర్వక అభివాదములు.

[4] నీలిమబ్బు వన్నె శరీర ఛాయతో పద్మముల వంటి పవిత్ర పాదములుకలవానికి, భద్రగిరిపై వెలుగొంది చల్లని చూపులతో చూచువానికి, ఉదయభాస్కరునిలా చల్లని కిరణాలతో మనోవైకల్యాలని కడిగివేయువానికి, దయాసాగరుడైన సీతాపతికి పరిరక్షించమని ఆవేదనం.

# కృతిపతి నియతి

*//శార్దూలము//* *[5]*

కోదండంబును దాల్చు దైత్యకుల విక్షోభోన్నతాకారికిన్,
మోదంబంద విపన్నులాదుకొని సంప్రోక్షించు భద్రాత్మకిన్,
వేదండంబును గావ నేగిడిన సంవేగప్రసన్నుండికిన్,
వేదాంగంబుల శోభమాన్యునకు నావేదింతు నైవేద్యమున్

[5] *విల్లు ధరించి దానవ సంతతికి కలతనిచ్చిన వానికి, దుఃఖభరితులను ఆదుకొని వారు సంత సించునట్లు శుద్ధిచేయు సదాచారసంపన్నుల రక్షణే స్వభావముగా కలవానికి, గజేంద్రుని రక్షించటానికి ఆత్రముగా వెళ్ళిన భక్త బాంధవునికి, వేదములు అవయవాలుగా ప్రకాశించు పూజనీయుడైన శ్రీరామచంద్రునికి (ఈ కావ్యాన్ని) నైవేద్యంగా సమర్పణ చేయుచున్నాను.*

*// సీసము//* *[6]*

కటికంఠి గరళాన్ని కంఠాన దిగమింగి
    నిధులిచ్చి జగతినే నిలుపురీతి,
శోకాగ్ని జ్వాలల జూపకా లోలోన
    దాచేసి జీవాత్మ దానమిచ్చి,
లోకాన పైకేగు రోతార్తి సోకకా
    చేలాంచలంబునే చిక్కగప్పి,
పోకార్చు రోగాలు మూగకా కాపాడి
    నన్నెంతో నేర్పుగా నలిగి పెంచ

*//తేటగీతి//* *[7]*

నెన్ని కష్టములొందెనో నేమొనీవు
వెన్నముద్దల తోడనే వేదవీతి
సన్నటడుగుల నాడునే సాధుసూక్తి
మన్నలెంచక నేర్పినా మాతృమూర్తి

[6] & [7] శంకరుఁడు హాలాహలాన్ని గొంతులో దాచుకొని అమృతాది సంపదలను ప్రపంచ శ్రేయస్సుకు వదిలిపెట్టిన విధముగా ప్రసవవేదన మొదలగు కష్టములను దిగమింగి ప్రాణముపోసి, ఈ ప్రపంచంలో చెలరేగుతున్న జుగుప్సాకరమైన పీడలు అంటకుండా కొంగుచాటున దాచి, నాశనముచేయు భరింపరాని వ్యాధులు రాకుండా చక్కగా కాపాడి, నను ఎంతో చాకచక్యంతో కష్టనష్టములను ఓర్చి పెంచటానికి ఎంత శ్రమనొందావో ఏమో, ఉగ్గుపాలతో పాటుగా మోక్షవిషయమైన బుద్ధి, నడక నేర్పేటపుడు సాత్విక ప్రవర్తన అవలీలగా నేర్పిన సరస్వతీ సమానురాలైన అమ్మా!

*//తేటగీతి//* *[8]*

ఏమి నీకివ్వగలను నేనెంతొవలచి
నీవు నేర్పిన విద్యలే నివిగో తల్లి
పాద పద్మములందుంచి భక్తి కొల్తు
లలిత కోమల వేంకటలక్ష్మి యరయు

[8] *ప్రేమతో నీకు ఏమి ఇవ్వగలను? నువ్వు అందజేసిన విజ్ఞానము ఇదిగో తల్లీ, నీ పాదాల దగ్గర ఉంచి వినమ్రతతో ప్రార్థిస్తున్నాను, మృదుమనోహరమైన అమ్మా, వెంకట లక్ష్మీ, పరీక్షించు.*

*// ఉత్పలమాల//* *[9]*

మాతకి, సర్వ సద్గుణ ప్రమాతకి, నిశ్చల నిష్కళంక సం
ధాతకి, జీవ యజ్ఞ వరదాతకి, సుందర మందహాస పూ
ర్వోదిత ముగ్ధభాతికి, పరోపకృతార్థ నిరంతరాత్ర సం
భ్రాతకి, జీవనాద్యుతికి, వల్లభజోస్యుల వంశధాత్రికిన్

[9] *సకల సద్గుణ సంపన్నురాలైన అమ్మకి, అచంచలమై ఎటువంటి కళంకము లేని కూర్పరికి, జీవితమనే క్రతువును వరముగా ఇచ్చిన దానశీలికి, అందమైన చిఱునవ్వుతోనూ ఉదయ భాస్కర తేజస్సుతోనూ ప్రకాశించే కల్లాకపటము ఎఱుగని తల్లికి, ఇతరుల ప్రయోజనం కోసం ఎల్లవేళలా వేగిరపాటు పడుదానికి, బ్రతుకుతెరువు చూపించిన మార్గదర్శికి, వల్లభజ్యోస్యుల వంశాన్ని పోషించినటువంటి అమ్మకి (ఈ కావ్యాన్ని సమర్పిస్తున్నాను)*

## ఆవేద నివేదన

*//శార్దూలము//* *[19]*
రామా! నామది నీదనంగ, సుమమాలాతోరణాలంకృతా
రామావేశిత, సంస్కరింప నవసంరబ్ధాతి సమ్మోహ మే-
ళా మాలాతృణకోద్ధతాలమట నుల్లాపించు సందోహమున్
రా, మా శంకలు దీర్పగా సుజనపాలాలోల సంలీలగా

[19] ఓ శ్రీరామచంద్రా! పూమాలలతో అలంకరించిన మంగళద్వారముగల వనములో నివసించు వాడా! మంచివారిని రక్షించే యిచ్ఛ గల వాడా! మా చింతలు మరియు సందేహాలు తీర్చటానికీ, అజ్ఞానము, చిత్తవైకల్యము కలిసిన పెరుగుతున్న కోపము, గర్వము ఎక్కువగా కలిగి, గడ్డి పురుగుల్లాగా బాధతో దుర్భాషలాడు (గట్టిగా రోదించు) జన సమూహాన్ని బాగుపరచటానికీ మనఃపూర్వకముగా ప్రార్ధించగానే అసాధారణ రీతిలో రమ్ము.

*//కందం//* *[20]*
రామా మౌనంబేమీ?
రా, మా డెందమున శంకలాతిశయమవన్
కామా నాస్తికులమికన్
కా మాడెందములనంత కాంక్షల కూపమ్

[20] మా మనసులో నీవున్నావో లేదోనని అనుమానము అధికమగుచు, కోరికల పుట్టలయి మమ్మల్ని నాస్తికులుగా మారుస్తున్నాయి, మౌనము వీడి వేంచేయుము శ్రీరామచంద్రా.

*//కందం//* *[21]*
మారామేమీ రామా?
మారా మా మొర మరి మరి మౌరా? మామా!
రారా మారమ్మీమా
మారామీరా, రమా రమం మా రేమా

[21] మారాం ఎందుకు రామా? ఎక్కువగు మా మొర మళ్ళీ మళ్ళీ ఊదిన నాగసరమా? (కినుక) మానుము మానుము! రా, వచ్చి కాపట్యం తగ్గటానికీ, లక్ష్మీ కళ ఎక్కువగా విజృంభించటానికీ కిటుకు ఇమ్ము.

*//కందం//* *[22]*
రాతిని నాతిగ జేయు-
వ్రాతయె పాతిత నిశాంత వాసంతవగన్
స్థాతగ మిగిలితివా? రా,
మా తాప నితాంతమారి మాత్రై రామా!

[22] రాతిని అహల్యగా మార్చిన వృత్తాంతము తెలియజెప్పే రామాయణ కావ్యాన్ని వాడి, పడి, నలిగి కృశించిన పుష్పంలాగా మరచితిరనా, శ్రీరామచంద్రా, శిలారూపంలో ఉండిపోయావు? మా అధికమవుతున్న సంతాపాన్ని అంతంచేసే నిశ్చయముతో రా స్వామి.

*// తేటగీతి//* *[23]*
శ్రేష్ఠ సుగుణ సంపన్న విశేషుడనిరి
వికలచిత్తుల గాయు కోవిదుడివనియు
రాకెటేగితివి దయాలలామ రామ
సాకతముచేయ తమవినాశనమవంగ?

[23] ప్రశస్తమైన సద్గుణములన్నీ సమృద్ధిగాగల మహనీయుడివనీ, కలవరముచెందినవారిని ఆదుకొను సుహృదయుడవనీ ప్రసిద్ధి. మా మతి భ్రమ, శోకము అంతంజేయకుండా ఎక్కడ ఉన్నావు, కరుణాసాగరుడివైన శ్రీరామచంద్రా?

*//చంపకమాల//* *[24]*
సులువుగ నెత్తినావు శివసూనృత గాండివ మొంద సీతనూ
పలువురు రాజశేఖరుల పౌరుషభంగము సేయగానటన్
కొలవగ సేవభావమున గోవిదకోటి పరాకుసేతువే,
తులితులనా జనంబులు వధూత్తమ గోరిన శౌర్యసేనలన్?

[24] సీతామాతను పొందటానికి అప్పుడు మిథిలానగరములో అతి సునాయాసంగా శివ ప్రసాదమైన ధనుస్సుని ఎక్కుపెట్టి అనేక రాజ ప్రముఖుల గర్వభంగము కావించావు. ఇప్పుడు అనేక ప్రజ్ఞావంతులు పరమభక్తితో ప్రార్థన చేస్తుండగా కినుక ఏల, ఈ ప్రజలను మైథిలిని కోరివచ్చిన రాజ ప్రముఖులతో సరిపోల్చితివా శ్రీరామచంద్రా?

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Sri+Rama+Ramamrutam**

* * *